ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us &
Empower their Academic Excellence
with Ethical Foundations
INDIRA
VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 177 మంగళవారం 01-07-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## సీఎం మార్పు అధిష్ఠానం చేతుల్లో!

**కర్ణాటక నేతలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పష్టం**

**ఖర్గే కాకుంటే.. ఇంకెవరు హైకమాండ్?: బీజేపీ**



**బెంగళూరు, జూన్ 30:** కర్ణాటకలో సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఖర్గే స్పందించారు. అలాంటి అంశాలపై అధిష్ఠానం మాత్రమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. 'అనవసర సమస్యలు' సృష్టించవద్దని పార్టీ నేతలకు హెచ్చరికలు చేశారు. ఖర్గే సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అక్టోబరులో రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉంటుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'చూడండి, అది హైకమాండ్ చేతుల్లో ఉంటుంది. అధిష్ఠానంలో ఏం జరుగుతుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. తదుపరి ఏ చర్య అయినా తీసుకొనే అధికారం వారికే ఉంటుంది' అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నేత అశోక్ స్పందించారు. ఖర్గేకు కాంగ్రెస్ పార్టీకి యాక్సిడెంటల్‌గా అధ్యక్షుడు అయ్యారని వ్యాఖ్యానించారు. "పార్టీ అధ్యక్షుడు హైకమాండ్ కాకుంటే.. ఇంకెవరు" అని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ప్రశ్నించారు. మరోవైపు ప్రభుత్వంలో చీలిక ఉందనే ప్రచారాన్ని సీఎం సిద్దరామయ్య కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం రాయిలాగా ఐదేళ్లు ధృడంగా ఉంటుందన్నారు. ఓ కార్యక్రమంలో శివకుమార్‌తో చేతులు కలిపి, పైకెత్తి ఐక్యతను చాటారు.

### సార్క్‌కు ప్రత్యామ్నాయంగా
## కొత్త గ్రూప్?

**దక్షిణాసియా దేశాలతో చైనా, పాక్, బంగ్లాదేశ్ మంతనాలు**

**భారత్‌కు కౌంటర్‌గా ఏర్పాటు యత్నాలు**

న్యూఢిల్లీ, జూన్ 30: భారతదేశం కీలక సభ్యదేశంగా ఉన్న సార్క్(దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం)కు ప్రత్యామ్నాయంగా మరో కూటమిని ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రయత్నిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం మేరకు ఈ విషయంలో పాక్, చైనా చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఇదే అంశంపై చైనాలోని కున్మింగ్‌లో జూన్ 19న నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ కూడా భాగస్వామ్యమైంది. 'సార్క్‌లో సభ్యదేశాలుగా ఉన్న ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త గ్రూప్‌లో చేరేలా ఆహ్వానించడమే కున్మింగ్ భేటీ లక్ష్యం' అని ఆ కథనం పేర్కొంది. శ్రీలంక, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ సహా సార్క్ సభ్యదేశాలు కొత్త గ్రూప్‌లో చేరే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ఈ కథనాన్ని బంగ్లాదేశ్ ఖండించింది. సార్క్‌లో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, భూటాన్, నేపాల్, మాల్దీవులు సభ్యదేశాలుగా ఉన్నాయి.



### రసాయన పరిశ్రమలో
# పేలుడు..
## 19 మంది దుర్మరణం

**సంగారెడ్డి, మియాపూర్, జూన్ 30 :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సిగాచి రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, 19 మంది దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి, ముద్దలుగా కనిపించాయి. అగ్నికీలలు, పేలుడు ధాటికి పక్కనే ఉన్న భవనం కూలిపోవడం, పార్క్ చేసిన వాహనాలకు నిప్పంటుకోవడంతో.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇంకో 15 మంది కార్మికులు గల్లంతైనట్లు సమాచారం. రాత్రి కడపటి వార్తలందేసరికి కూడా పరిశ్రమలో శిథిలాల వెలికితీత కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఎయిర్‌వాక్స్ పేలినట్లు పేర్కొన్నారు. సాయంత్రానికి అది డయ్యర్ పేలుడు అయ్యి ఉండొచ్చని, రియాక్టర్ కాకపోవచ్చని వెల్లడించారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారంలో కొనసాగుతున్న సిగాచి పరిశ్రమలో.. ఉదయం షిఫ్ట్‌లో 6 గంటలకు పలువురు కార్మికులు విధులకు హాజరయ్యారు. జనరల్ షిఫ్ట్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి పలువురు కార్మికులు, సూపర్‌వైజర్లు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, అధికారులు లోనికి వచ్చారు. సరిగ్గా 9.10 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతతో 2 కిలోమీటర్ల వరకు భూమి కంపించింది. భారీ శబ్దం వినబడింది. పరిసర పరిశ్రమల్లోని కార్మికులు భూకంపం వచ్చిందంటూ బయటకు పరుగులు పెట్టారు. రోడ్డుపైన, పరిశ్రమల్లో పార్క్ చేసిన పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నారని సమాచారం. ఈ ప్రమాదంలో హాజరు రికార్డు కూడా బుగ్గిపాలైందని తెలిసింది. పేలుడు సంభవించగానే.. అగ్నికీలలు వేగంగా వ్యాప్తిచెందాయి. పరిశ్రమలోని పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు సైతం నిప్పంటుకోవడాన్ని బట్టి, తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆ వెంటనే పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. దీంతో అక్కడున్నవారికి ఏం జరిగింది? ఏం జరుగుతోంది? అనేది అర్థం కాలేదు. లోపల బాధితుల హాహాకారాలతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లుతున్నా.. లోనికి వెళ్లలేనంతగా పొగ వ్యాప్తి చెందింది. దీంతో స్థానికులు డయల్-100కు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులతోపాటు.. రిజర్వ్ బలగాలు, 11 ఫైరింజన్లు, అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొని మృత దేహాల వెలికి తీతను ప్రారంభించాయి.

## భారీ వర్షాలతో ముగ్గురి మృతి



**సిమ్లా, జూన్ 30:** హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీవర్షాలు కుదిపేస్తున్నాయి. ఈ కారణంగా 24 గంటల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఈ ఏడాది వర్షాల కారణంగా హిమాచల్‌లో మరణాల సంఖ్య 20కి పెరిగింది. సిమ్లాలో 5 అంతస్తుల ఓ భవనం సోమవారం కుప్పకూలింది. అందులో నివాసం ఉంటున్నవారు ముందుగానే బయటపడడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. భారీవర్షాల కారణంగా రాష్ట్రంలోని 259 రోడ్లను మూసివేశారు. సోలన్‌లో ఒక వంతెన కొట్టుకుపోయింది. రాష్ట్రంలోని 130 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాంగ్రా, మండి, సిర్మార్, సోలన్ జిల్లాల్లో సోమవారం పాఠశాలలను మూసివేయాల్సిందిగా సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు ఆదేశించారు. సిమ్లా-కాల్కా రైల్వే లైనులో భారీ వర్షాలకు ట్రాక్‌పై బండరాళ్లు పడడంతో రైళ్లు నడవలేదు.

### మనకూ బంకర్
## బస్టర్ బాంబులు

**అమెరికా తరహాలో అభివృద్ధిపై భారత్ దృష్టి**

**7,500 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లేలా అగ్ని-5లో మార్పులు**

న్యూఢిల్లీ, జూన్ 30: ఇటీవల ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా ప్రయోగించిన బంకర్ బస్టర్లు తీవ్ర నష్టం కలిగించాయి. దీంతో వాటి సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అమెరికా తరహాలో బంకర్ బస్టర్ బాంబుల తయారీపై దృష్టిపెట్టింది. అయితే వీటిని యుద్ధ విమానాలపై నుంచి కాకుండా క్షిపణుల ద్వారా ప్రయోగించేందుకు వీలుగా అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిలో మార్పులు చేస్తున్నట్టు తెలిసింది. దీనికోసం ఇప్పటికే రంగంలోకి దిగిన డీఆర్‌డీవో భారీ బంకర్ బస్టర్ బాంబును మోసుకెళ్లేందుకు వీలుగా అగ్ని-5 మిస్సైల్‌లో మార్పులు చేస్తోంది.

## ప్రధాని మోదీ 5 దేశాల పర్యటన ఖరారు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. జూలై 2 నుంచి ఎనిమిది రోజులపాటు ఆయన పర్యటన సాగుతుంది. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ప్రధానమంత్రి పర్యటిస్తారని కేంద్ర విదేశాంగలోని ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపారు. పర్యటనలో భాగంగా తొలుత ఘనాలో జూలై 2, 3 తేదీల్లో ప్రధాని పర్యటిస్తారు. మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే మొదటిసారి. వ్యవసాయం, వ్యాక్సిన్ డెవలప్‌మెంట్, ఘనాలో వ్యాక్సిన్ హబ్ ఏర్పాటు, రక్షణ రంగంలో సహకారం వంటివి ప్రధానంగా చర్చిస్తారు. అనంతరం ట్రినిడాడ్ అండ్ టొబాగాలో 3, 4 తేదీల్లో పర్యటిస్తారు. జూలై 4న అర్జెంటీనాకు వెళ్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో విస్తృత చర్యలు జరుపుతారు. 5వ తేదీన నుంచి 8వ తేదీ వరకూ బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియోలో జరిగే 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. 9న నమీబియా వెళ్లారు. ద్వైపాక్షిక చర్చలతో పాల్గొనడంతోపాటు పార్లమెంటులోనూ ప్రధాని ప్రసంగిస్తారు.

### నేటి నుంచే తత్కాల్‌కు
## ఆధార్ లింక్

**సర్క్యులర్ జారీ చేసిన రైల్వే శాఖ**

**నేటి నుంచి అమల్లోకి రైలు చార్జీల పెంపు**

**ఏసీ- కి.మీ.కి 2 పైసలు.. నాన్ ఏసీ-1 పైసా**




**న్యూఢిల్లీ, జూన్ 30:** తత్కాల్ టికెట్ కోసం ఆధార్ నెంబరును తప్పనిసరి చేస్తూ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మంగళవారం నుంచే అమల్లోకి రానుంది. తత్కాల్ టికెట్ కావాలనుకునే వారు ఆధార్ నెంబరును ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దాని ఆ?ధారంగా టికెట్ మంజూరవుతుంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాన్ని అసలైన ప్రయాణికులు మాత్రమే పొందేలా ఈ మార్పులు చేసింది. బాట్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించిన అనుమానాస్పద వ్యక్తులు టికెట్లు బుక్ చేస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకొంది. అలాంటి వ్యక్తులకు సంబంధించిన సుమారు 2.5 కోట్ల ఖాతాలను బ్లాక్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ఐఆర్‌సీటీసీ ద్వారా తత్కాల్ ఇ-టికెట్ బుకింగ్ కోసం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. రైల్వే కౌంటర్ వద్ద కూడా ఇదే విధానం అమలవుతుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు ఆన్‌లైన్ వినియోగదారులకు, స్టేషన్లలోని కౌంటర్ల వద్ద నిలబడే వ్యక్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్లు, అధీకృత ఏజెన్సీలు అరగంట తర్వాత టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ముందుంటుంది..

హైదరాబాద్, జూన్ 30 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీపీఐ నేతలు సోమవారం జూబ్లీహిల్స్‌లో సీఎంని ఆయన నివాసంలో కలిశారు. అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, వరంగల్, భూపాలపల్లి, మేడ్చెల్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, పంచాయతీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు



నిర్వహించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు.

## గ్రూప్-1పై వాదనలు త్వరగా ముగించండి

**అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు: హైకోర్టు**



**హైదరాబాద్, జూన్ 30:** గ్రూప్-1 పరీక్షల పిటిషన్లపై వాదనలను త్వరగా ముగించాలని హైకోర్టు సంబంధిత న్యాయవాదులను సూచించింది. నియామకపత్రాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేసింది. సమాధాన పత్రాలు సరిగా దిద్దలేదని, మూల్యాంకనంలో అక్రమాలు, తుది అభ్యర్థుల సంఖ్యలో తేడాలు సహా అనేక లోపాలున్నాయని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నందున నియామక పత్రాలు ఇవ్వరాదని స్టే విధించింది. ఆ స్టే ఎత్తేయాలని కోరుతూ టీజీపీఎస్సీ మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసింది. వీటిన్నింటిపై సోమవారం జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్‌ల తరపున సీనియర్ న్యాయవాదులు జీ విద్యాసాగర్, సురేందర్‌రావు వాదనలు కొనసాగించారు. కోర్టు సమయం ముగియడంతో వాదనలు మంగళవారానికి వాయిదాపడ్డాయి.

# వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాల అమలు

**ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్: పొంగులేటి**

**వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**రాయపర్తి, హైదరాబాద్, జూన్ 30:**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్‌దేనన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో రూ.14.17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి, నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు.

# తొర్రూర్ లయన్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం

## లయన్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి



**తొర్రూరు తొలి సమయం జూన్ 30**

లైన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ ఆధ్వర్యంలో లయన్ నవీన్ కుమార్ అధ్యక్షతన 38వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకట్ రెడ్డి హాజరై లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వారి సేవలు అమోఘమని, 320%ట%, మల్టిపుల్ లోనే తొర్రూర్ కి ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉన్నదని పర్యావరణాన్ని పరిరక్షించుట క్యాన్సర్ నిర్మూలన, అంగర్ రిలీఫ్ సమాజం కొరకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు లయన్స్ ఇంటర్నేషనల్ ఆదేశాలు కనుగుణంగా సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. మొదటగా నూతన కార్యవర్గం అధ్యక్షులుగా లయన్ డాక్టర్ రామ నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా లయన్ రవీందర్ రెడ్డి, కోశాధికారిగా లయన్ శ్రీనివాసు చేత రెండవ జిల్లా ఉప గవర్నర్ లయన్ పుట్ట హరి కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించి వారి బాధ్యతలను గుర్తు చేశారు.మొదటి ఉప జిల్లా గవర్నర్ లయన్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ లైన్స్ క్లబ్ అనేది ఇంటర్నేషనల్ స్థాయిలో అనేక క్లబ్బులను కలిగి ఉండి లయన్స్ యొక్క లక్ష్యం సమాజ సేవ అని నూతన కార్యవర్గాన్ని అభినందించి జిల్లాలోని మొదటి స్థాయిలో ఉండేటట్లు ఎక్కువ సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.పూర్వ జిల్లా గవర్నర్ లయన్ లక్ష్మీనరసింహారావు గారు మాట్లాడుతూ జిల్లాలోని తొర్రూర్ లయన్స్ కి ఎంతో పేరు ఉన్నదని, ఈ నూతన కార్యవర్గాన్ని అభినందించి సేవా కార్యక్రమాలు బాగా చేయాలని అధ్యక్షులు లయన్ రామ నర్సయ్య ని కోరారు.తొర్రూర్ చార్టర్ ప్రెసిడెంట్, పూర్వ జిల్లా గవర్నర్ లయన్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం ను అభినందించి అత్యధిక సభ్యత్వమును కలిగి సేవా కార్యక్రమాలలో ముందున్న లైన్స్ క్లబ్ ను అభినందించారునూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు లయన్ డాక్టర్ రామ నరసయ్య యొక్క అంగీకార ప్రసంగంలో నన్ను అధ్యక్షునిగా నియమించినందుకు లైన్స్ క్లబ్ తొరూరు వారికి ఎంతో రుణపడి ఉంటానని నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్లబ్ యొక్క పేరు ప్రతిష్టలు కాపాడుతానన్నారు ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్షులు వెంటనే సేవా కార్యక్రమాల్లో భాగంగా బొడ్లాడ, ఖానాపురం గ్రామస్తులకు 100 గొడుగులను మరియు అమ్మాపురం పేద వ్యక్తికి ఒక ఇస్త్రీ పెట్టెను అందజేశారు. కార్యక్రమంలో లయన్ పి డి జి సుధాకర్ రెడ్డి, లయన్ తుమ్మేటి వెంకటరెడ్డి, లయన్ శారద, లయన్ వెంకటరెడ్డి, లయన్ శ్రీదేవి లయన్ తమ్మెర విశ్వేశ్వరరావు, లయన్ యాదగిరి రెడ్డి, లయన్ వీరభద్రరావు, లయన్ కిరణ్ కుమార్, లయన్ రేగురి వెంకన్న లయన్ శివశంకర్ చార్టర్ మెంబర్లు క్లబ్బు సభ్యులు లయన్ లేడీ లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన

## పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము



**తొలి సమయం దంతాలపల్లి జూన్ 30**

దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోసి ప్రారంభం చేశాడు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు డిప్యూటీ స్పీకర్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రునాయక్ సహకారకారంతో నేడు దాట్ల గ్రామంలో లబ్ధిదారురాలు సయ్యద్ బిబి %ఔ/సా% చందు . మంజూరు పత్రాలు అందజేసి ముగ్గు పోశాడు. ఈకార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు సంపెట సురేష్ గౌడ్. గ్రామ పార్టీ అధ్యక్షులు గుండాల అయిలయ్య, గుజ్జ శ్రీధర్. సంపేట అశోక.బాలేశ . సయ్యద్ యాకుబ్.సత్తయ్య.అంజి.యూత్ కాంగ్రెస్ నాయకులు జంపాల నవీన్.తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమాయత్త సమావేశం

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**తొలి సమయం తొర్రూరు జూన్ 30**

తొర్రూరు మండలంలోని హరిపిరాల, చర్లపాలెం ఎంపిటిసి పరిధి గ్రామాల బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమాయత్త సమావేశం జరిగింది. మండల పార్టీ ఇంచార్జ్ శ్రీరామ్ సుధీర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికలలో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. చెర్లపాలెం గ్రామ వాసిగా చెప్పుకుంటూ ఎమ్మెల్యేగా గెలిచినా యశస్విని రెడ్డి గ్రామానికి ఏం చేసిందో చెప్పాలని అన్నారు. మా నాయకుడు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిన్న గ్రామ పంచాయతీల నుండి పెద్ద గ్రామ పంచాయతీలకు ఒక కోటి నుండి రెండు కోట్ల వరకు సిసి రోడ్లు మరియు డ్రైనేజీలు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. కానీ ఏ ఒక్క కాడ కూడా కొబ్బరికాయలు కొట్టలేదు కానీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి 5 లక్షల సిసి రోడ్లకు కూడా గ్రామాలకు వెళ్లి శంకుస్థాపనలు చేసి అభివృద్ధి పతంలో పాలకుర్తి అని చెప్పుకోవడం సరి అయినది కాదు అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు ,మాజీ జెడ్పిటిసి జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నల మాస ప్రమోద్ ,నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు ,కాలు నాయక్, దొనికెన కుమారస్వామి, రాయిశెట్టి వెంకన్న, కే జనార్దన్ రాజు, హరిపిరాల గ్రామ



పార్టీ అధ్యక్షులు కొండ వెంకన్న, బుర్రి మురళి, వల్లపు లింగయ్య చంచర్ల రాజు కర్కాల గ్రామస్తులు ఇంతల రాజలింగం, పసలాది వెంకన్న కే మల్లారెడ్డి ని,మ్మల ఐలయ్య చర్లపాలెం గ్రామస్తులు మాజీ సర్పంచ్ సట్ల నాగలక్ష్మి, అనంతరెడ్డి, మాజీ ఎంపిటిసి ధర్మారపు కిరణ్ , పి ఎమ్ కృష్ణ, ధర్మారపు యాకూబ్ ,బొలగాని వెంకన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు

# దాసరి మురళి జన్మదిన వేడుక



**తొలి సమయం దంతాలపల్లి జూన్ 30,**

భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు దాసరి మురళి జన్మదిన వేడుకలు, దంతాలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చీకటి మహేష్ గౌడ్ ,సారెడ్డి రాణి రెడ్డి, తాడ పూర్ణచందర్ రెడ్డి, చిన్నాల ప్రవీణ్ లతోపాటు దంతాలపల్లి మున్నూరు సంఘం నాయకులు సుతారపు అర్జున్ నెల్లూరు రవి నెల్లూరు యాకయ్య, ఉప్పాలయాకేష్ జంగాల అర్జున్ తదితరులు పాల్గొన్నారు

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మిక తనిఖీ

**ఎం.ఎల్.హెచ్.పి రికార్డుల నిర్వహణ సరిగా లేదని అసహనం**

**వర్షాకాలంలో వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి -జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్**



**తొలి సమయం గూడూర్/మహబూబాబాద్, జూన్ 30:**

గూడూరుఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను లిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వైద్యసేవల నాణ్యత, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, రికార్డు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ సేవలు నిరంతరం అందు బాటులో ఉండాలని, స్థానిక ఎం.ఎల్. హెచ్.పి రికార్డుల నిర్వహణ సరిగా లేదంటూ అసహనం వ్యక్తం చేస్తూ భవిష్యత్తు లో పునరావృతం కావొద్దని ఆదేశాలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో జబ్బులు రాకుండా తగు జాగ్రత్తలుతీసుకోవాలని అన్నారు. ప్రజలకు సమయానికి మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రతి ఆరోగ్య కేంద్రం తన బాధ్యతగా పనిచేయాలన్నారు. గ్రామాలలో మెడికల్ క్యాంప్ లను నిర్వహించాలని, తమ ప్రాంతములో ఆశ్రమ పాటశాలలు వుంటే అక్కడి పిల్లలకు వైద్య పరీక్షలు అంధించాలని పేర్కొన్నారు.గర్భిణి స్త్రీల నమోధును 12 వారాలలోపు గానే పూర్తి చేయాలని, హై రిస్క్ గర్భిణి స్త్రీలను ప్రసవం కోసం జిల్లా ఆసుపత్రికి పంపించాలని, వర్షాలు ఎక్కువగా వున్నట్లైతే కాన్పుకు దగ్గరగా వున్న వారిని ముందుగానే ఆసుపత్రికి తరలించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమములో స్థానిక ఆరోగ్య అధికారి డాక్టర్ యమున, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి, కొప్పు ప్రసాద్ స్థానిక ఎంఎల్హెచ్పి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్మపేట ఆవరణలో కొత్తగా నిర్మించే పెట్రోల్ బంక్ నిర్మాణం ఆపాలి

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిమాండ్

**అశ్వరావుపేట ఆర్సి జూన్ 30 )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట ఆవరణలో కొత్తగా నిర్మిం చే పెట్రోల్ బంక్ నిలిపివేయాలని సి పిఐ ఎంఎల్ మాస్ లైన్, పార్టీ అను బంధ అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులుపందురి వీరబా బు డిమాండ్.అశ్వరావుపేట నియో జకవర్గం దమ్మపేట మండలం దమ్మ పేట బస్టాండ్. జలగం ప్రసాద్ రావు మంత్రివర్యులుగా ఉన్న కాలంలో ద మ్మపేటలో కొందరు దాతలు సహృ దయంతో బస్టాండ్ స్థలాన్ని కేటా యించి ఇక్కడ బస్టాండ్ ఉండాలని పట్టుపట్టి బస్టాండనిర్మించారు మం డల హెడ్ కోటర్ అని పేరు తప్ప ఏ రోజు బస్టాండ్ కి బస్సులు వచ్చిన దాకళాలు లేవన్నారు ఈ దమ్మపేట మండలంలో మంత్రులు ఉన్నారు ఎ మ్మెల్యేలు ఉన్నారు కానీ అభివృద్ధి చేసిన దాఖలులేవన్నారు ఇప్పు డు ఉన్నఎమ్మెల్యే జారేఆదినారాయ ణ ప్రజలు మనస్ఫూర్తిగా గెలిపించు కుంటే వాళ్ల నమ్మకాన్ని ఉమ్ము చే సింది కాకుండా ప్రజాధనాన్ని దుర్వి నియోగపరుస్తున్నారు ముందు ఈ బస్టాండ్ ఆవరణాన్ని, బీజేక్రిమెంట్ 90 సంవత్సరాలు ఇచ్చినట్టు ఇచ్చి అమ్మకాలకు కోరుకుంటున్నారు.

# ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్‌గా ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి

**తొలి సమయం హన్మకొండ జూన్ 30:**

హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ గా సీనియర్ న్యాయవాది ఎడవల్లి సత్యనారాయణరెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. వీరు హనుమకొండ జిల్లాలోని భూసంస్కరణల ప్రత్యేక కోర్టు మరియు మొదటి అదనపు జిల్లా కోర్టులో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదిస్తారని పేర్కొన్నారు. ఈ బాధ్యతల్లో వీరు మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారన్నారు. హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది సత్యనారాయణ రెడ్డి గత 35 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. జిల్లాలోని సీనియర్ క్రిమినల్ లాయర్ అర్శనపల్లి వెంకటేశ్వరరావు వద్ద జూనియర్ గా తన వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యనారాయణ రెడ్డి గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాను నాలుగవ అదనపు ఫాస్ట్ ట్రాక్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాను తన సేవలు అందించారు. తన నియామకానికి సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు వేం నరేందర్ రెడ్డి కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో అంకితభావంతో పని చేస్తున్న నా సేవలను గుర్తించి, నన్ను గౌరవించి నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్ పదవిని సవ్యంగా నిర్వహించి ప్రభుత్వం తరపున వాదించి కేసుల పరిష్కారంలో చిత్తశుద్ధితో పని చేస్తానాని తెలిపారు.

**కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ ప్లీడర్లు**

హనుమకొండ జిల్లాకు జిల్లా భూసంస్కరణల ప్రత్యేక కోర్టు కమ్ మొదటి అదనపు జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ గా నియామకమైన ఎడవెల్లి సత్యనారాయణ, హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్లీడర్ కె నర్సింహారావు, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు అదనపు ప్రభుత్వ ప్లీడర్ నూకల వెంకటరమణారెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు.

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మొక్క బహుకరణ**

హనుమకొండ జిల్లాకు ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్ గా నియామకమైన ఎడవెల్లి సత్యనారాయణ సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఆయనతో పాటు న్యాయవాదులు చింత నిఖిల్ కుమార్, సాయిని నరేందర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ గా నియమితులైన సత్యనారాయణ రెడ్డికి హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్లీడర్ కె నర్సింహారావు, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పులి సత్యనారాయణ, కొత్త రవికుమార్, వరంగల్ బార్ అధ్యక్ష, కార్యదర్శులు వలస సుధీర్ కుమార్, రమాకాంత్, సీనియర్ న్యాయవాదులు గుడిమల్ల రవికుమార్, ముద్దసాని సహోదర్ రెడ్డి, వై శ్యామ్ సుందర్ రెడ్డి, మంగినపల్లి సదాశివుడు, బి వి శ్రీపతిరావు, సారంపెల్లి మధుసూదన్ రెడ్డి, సి హెచ్ రవీందర్ రెడ్డి,



మహమూద్, జి విద్యాసాగర్ రెడ్డి, చిల్ల రాజేంద్రప్రసాద్, నబీ, తీగల జీవన్ కుమార్, అంబరీష్ రావు, వేముగంటి బాలకిషన్ రావు, బత్తిని రమేష్ గౌడ్, రమణమూర్తి, బోయినపల్లి సోమేశ్వర్ రావు, టి రవీందర్ రావు, లడె రమేష్, నోముల నరేందర్, దయాన్ శ్రీనివాస్, పోతరాజు రవి, జి మురళీ కృష్ణ, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు తొగరు జగన్ మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తోట రాజ్ కుమార్, శేఖర్ రావు, ముధుసర్, కూనూరు రంజిత్ గౌడ్, ఐ ఎల్ పి ఎ నాయకులు సాయిని నరేందర్, సురేందర్ గౌడ్, ముచ్చు రాజేందర్, శ్రీనివాస్, బండి మొగిలి, అనిల్ కుమార్, ఎగ్గడి సుందర్ రామ్, నూనావత్ రమేష్, మంద విజేందర్ బార్ అసోసియేషన్ నాయకులు చింత నిఖిల్ కుమార్, అంబేద్కర్, చింత సాంబశివరావు, సి మల్లేష్, న్యాయవాదులు వలబోజు కేశవ్, పరమాత్మ, రాహుల్, ఇజ్జగిరి చంద్ర శేఖర్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, రాచకొండ ప్రవీణ్ కుమార్, బొమ్మ నాగరాజు, భవాని ప్రసాద్, జె జె స్వామి, గంధం శివ, గురిమిల్ల రాజు, గోపికరాణి జన్ను పద్మ, ఆరేపెల్లి త్రివేణి, అడ్లూరి పద్మ, జన్ను ప్రభాకర్, మిరియాల వేణు పటేల్, వలిఉల్లా ఖాద్రీ, మాజీ కార్పొరేటర్ అబూబకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

# పోడు జీవుల గోడు...



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన? మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు? నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

# మద్దతు ధరల మర్మం !



కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది.

రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య్ర వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి. అంతేకా కుండా... ఆదాయవనరుగా తీర్చిదిద్ది నిరుద్యోగాన్ని నిర్మూలించేలా చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించాలి. అప్పుడే వ్యవసాయం బతికిబట్ట కలదు. తాజాగా చెరుకుకే కాకుండా మిగతా పంటలకు కూడా మద్దతు ధరలను పెంచాలి.


# కార్పొరేట్ కులతత్వం




జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లూనుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

# జలమే మానవాళికి జీవనాధారం

**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ



సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వసం చేయడం, చెరువుల, కాలువను ధ్వసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్దాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# షాంఘైలో ద్వంద్వ నీతి




షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆవిర్భావ ఆశయాల్లో ఉగ్రవాదం మీద ఉమ్మడిపోరు ఒకటిగా ఉన్నప్పుడు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఎలా? అన్న అంశంమీదే మొన్నటి సదస్సు కూడా జరిగిన తరువాత, సంయుక్త ప్రకటనలో పహల్గాం ప్రస్తావన లేకపోవడాన్ని విస్మరణగా కాక, కుట్రగానే భావించాలి. రెండురోజుల పాటు రక్షణమంత్రుల స్థాయిలో మేధోమథనం జరిగిన తరువాత, సదస్సు ముగింపు సందర్భంగా విడుదల చేద్దామనుకున్న ఉమ్మడి ప్రకటన భారత్ అభ్యంతరాల నేపథ్యంలో నిలిచిపోయింది. పహల్గాం ఊసులేనందుకు అభ్యంతరం వెలిబుచ్చుతూ సంతకం చేయడానికి మన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిరాకరించారు. ఉగ్రవాదంమీద కలసికట్టుగా పోరాడదామని సంకల్పించి, ఒక భయానకమైన ఉగ్రదాడి జరిగిన తరువాత కూడా, ఒక దేశం అభ్యంతరం వెలిబుచ్చిందనో, దానికి ఆగ్రహం కలుగుతుందనో సంయుక్త ప్రకటనలో సదరు సంఘటన ప్రస్తావన లేకుండా చేయడం ద్వంద్వప్రమాణాలకు నిదర్శనమని రాజ్‌నాథ్ విస్పష్టంగా ప్రకటించారు. శాంతి, భద్రత, పరస్పర విశ్వాసం ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళనీ, శాంతి, ఉగ్రవాదం ఒక ఒరలో ఇమడవని ఆయన గుర్తుచేశారు. రాజ్‌నాథ్ తన ప్రసంగంలో ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. లష్కరే తోయిబా జరిపిన గతకాలపు ఉగ్రదాడులు, ఇప్పుడు దాని అనుబంధ సంస్థ చేసిన పహల్గాం ఉగ్రదాడి, ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఇత్యాది అంశాలతో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం ఎంతో లోతుగా సాగింది. భారత్ ప్రతీకారం తీర్చుకుందని, ఉగ్రవాద కేంద్రాలను దుంపనాశనం చేసిందని, ఈ నేపథ్యంలో సభ్యదేశాలన్నీ ఉగ్రవాదాన్ని ఖండించాలన్నది ఆ ప్రసంగ సారాంశం. పాకిస్థాన్‌పై అంతటి విమర్శ దట్టించిన ఆ ప్రసంగం తరువాత, ఉమ్మడి ప్రకటనలో ఉగ్రవాదం ఊసెత్తనివ్వకుండా ఏ దేశం అడ్డుపడిందో ఊహించడం కష్టం కాదు. సదస్సు సవ్యంగా, సయోధ్యతో ముగిసిందని చైనా తేల్చేసింది. సంతకం చేయకపోవడంపై భారత్‌ను వెనకేసుకొస్తున్నవారు ఉన్నట్టే, వ్యతిరేకిస్తున్నవారూ ఉంటారు. పహల్గాం ప్రస్తావన లేకపోవడం కంటే, బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ఈ సహకార సంస్థలోని సభ్యదేశాలన్నీ ఐకమత్యంగా ఖండించడం భారత్‌కు ఆగ్రహం కలిగించిందని, పాకిస్థాన్ సాధించిన ఈ దౌత్యవిజయం భారత్‌ను ఇరకాటంలో పడవేసిందని విశ్లేషకులు అంటున్నారు. పహల్గాం దారుణం, పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదం ప్రస్తావనలు లేకుండా, ఒక అంతర్జాతీయ వేదిక కేవలం బలూచిస్థాన్ గురించి మాట్లాడటమంటే మన దౌత్యవిధానం విఫలమైనట్టేనని విపక్షనేతల విమర్శ. మోదీ ఏలుబడిలో భారత్ ఏకాకి అయిపోయింది, మిగతా ప్రపంచంముందు మనకు అవమానాలు మిగులుతున్నాయి, పాకిస్థాన్‌కు బిలియన్ల కొద్దీ డాలర్లు సాయంగా అందుతూంటే, ఉగ్రవాదాన్ని కనీసంగా ఖండించడానికి కూడా మనపక్షాన ఎవరూ నిలవడం లేదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది. ఈ సహకార సంస్థ ఆవిర్భావ లక్ష్యాలను, ఆశయాలను అటుంచితే, ఈ సంస్థలో కీలకపాత్రలు, పాత్రధారులు ఎవరో తెలిసిందే గనుక, ఉమ్మడి ప్రకటనలో మార్చి 11న బలూచ్ లిబరేషన్ ఆర్మీ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం గురించి మాత్రమే గుండెలు బాదుకొని, మరుసటి నెలలోనే పాతికమంది పర్యాటకులను పహల్గాంలో ఊచకోతకోసిన దారుణాన్ని అలవోకగా విస్మరించడం ఆశ్చర్యం కలిగించదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేదికమీద మనం ఒంటరి కావడంలోనూ విశేషమేమీలేదు. పాకిస్థాన్‌ను నొప్పించడం ఇష్టంలేకపోవచ్చు సరే, దానిని మెప్పించడానికి చైనా ఇంత నిస్సిగ్గుగా సిద్ధపడటమే ఆశ్చర్యం కలిగిస్తుంది. బలూచ్ ఘటనకూ, పహల్గాం ఘటనకు హస్తిమశ కాంతరం ఉన్న విషయం చైనాకు తెలియనిది కాదు. అక్కడ సాయుధులు ఉన్నారని, ఇక్కడ నిరాయుధులు బలైనారనీ, మతం అడిగి మరీ పర్యాటకుల ప్రాణాలు తీశారనీ, ఇది పాక్ ప్రేరేపిత ఉగ్రఘాతుకమనీ దానికి తెలుసు. సరిహద్దులు దాటివచ్చి భారత భూభాగాలను ఆక్రమించుకుంటున్న ఒకదేశం, సరిహద్దులు దాటించి ఉగ్రవాదులతో ఊచకోతలు కోయిస్తున్న మరొక దేశానికి వత్తాసు పలకడంలో ఆశ్చర్యమేమీ లేదు.

# తాలిబన్లతో తంటా..







ఇస్లామిక్ ఉగ్రవాదం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న అరబ్‌దేశాలకు తాలిబన్ల పునరాగమనం సహజం గానే ఆందోళన కలిగిస్తోంది. ఇస్లామిక్ ఉగ్రవాదుల కంచుకోట అయిన అఫ్ఘానిస్థాన్‌లోని తాజా పరిణామాలను అరబ్ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. గతంలో తాలిబన్ల ప్రభుత్వాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గుర్తించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, పాకిస్థాన్ ఈ సారి తొందరపడడం లేదు. 1990 దశకంలో తాలిబన్లు తొలిసారి అధికారానికి వచ్చినప్పుడు వారి ప్రభుత్వాన్ని కేవలం ఆ మూడుదేశాలు మాత్రమే గుర్తించాయి. తాలిబన్ల కొత్త ప్రభుత్వాన్ని గుర్తించే విషయమై అమెరికా, ఇతర దేశాలు ఇంకా ఒక స్పష్టమైన ప్రకటన చేయలేదు. అలా చేయకున్నప్పటికీ ఖతర్‌లోని తాలిబన్ల రాజకీయ సంప్రదింపుల కార్యాలయంతో అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా సహా అనేక దేశాలు కొద్దికాలంగా నిరంతరం సంప్రదింపులలో ఉన్నాయి. చైనా, రష్యా తాలిబన్ల నూతన ప్రభుత్వాన్ని గుర్తించనున్నట్టు ఇప్పటికే పరోక్ష సంకేతాలు ఇచ్చాయి, పాకిస్థాన్, ఇరాన్, ఉజ్బెకిస్థాన్, చైనా, తజికిస్థాన్, తుర్క్మెనిస్థాన్ దేశాలు అఫ్ఘానిస్థాన్‌తో భౌగోళికంగా సరిహద్దులు కలిగి ఉన్నాయి. ఆ దేశాలలోని వివిధ తెగలతో అఫ్ఘానీ తెగలకు బంధుత్వాలు ఉన్నాయి. అఫ్ఘాన్‌తో 900 కిలోమీటర్ల సరిహద్దు కలిగి ఉన్న షియా ఇరాన్, సున్నీ ముస్లింల తాలిబన్ల ప్రభుత్వాన్ని గుర్తించడం అంత సులువు కాదు. ఇరాన్‌లో ఇప్పటికే ముప్పై లక్షల మంది అఫ్ఘాన్ శరణార్థులు ఉన్నారు. అదే విధంగా, పాకిస్థాన్‌తో అఫ్ఘాన్‌కు 2600 కిలోమీటర్ల సరిహద్దు ఉన్నది. ఆ దేశంలో కూడా ఇంచుమించు 30 లక్షల మంది సున్నీ అఫ్ఘానీ శరణార్థులు ఉన్నారు. తాలిబన్ల గుర్తింపు అనేది పాకిస్థాన్‌కు లాంఛనమే కానీ ప్రస్తుత పరిస్థితులలో అంతర్జాతీయ సమాజ అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించేందుకు ఇస్లామాబాద్ పాలకులు సంసిద్ధంగా లేరు. అమెరికాపై తీవ్ర వ్యతిరేకత, గ్యాస్ రవాణా ప్రయోజనాల దృష్ట్యా చైనా, రష్యా మాత్రమే తాలిబన్ల పట్ల మెతకవైఖరి ప్రదర్శిస్తున్నాయి. అందరినీ కలుపుకుని వెళ్ళడమే తమ అభిమతమని తాలిబన్లు ఉద్ఘాటిస్తున్నప్పటికీ పాకిస్థాన్‌తో సహా ఏ దేశానికీ వారి మాటపై విశ్వాసం లేదు. అఫ్ఘానిస్థాన్ లోని భౌగోళిక, సామాజిక పరిస్థితుల కారణాన విభిన్నతెగలు వివిధ చోట్ల ఆధిపత్యం చెలాయిస్తాయి, పరస్పరం ఘర్షించుకునే ఈ తెగలన్నీ కలిసి సమష్టిగా ప్రభుత్వం నడపడం అనేది సునాయాసమేమీ కాదు. బలవంతుడిదే రాజ్యం అనేది అఫ్ఘానిస్థాన్‌లో ఒక మౌలిక సూత్రం. దేశవ్యాప్తంగా అధికారాలను చెలాయించ గలిగే జాతీయ పాలనావ్యవస్థ మొదటి నుంచీ కూడా అఫ్ఘాన్‌లో లేదు. రాజధాని కాబూల్ నుంచి ఒక శాసనం జారీ అయితే ఆయా ప్రాంతాలలో అది అమలు కావాలంటే తెగల నేతల ఆమోదం తప్పనిసరి. పష్తూన్, ఉజ్బెకీ, తజ్కీ, బలూచీ, హాజరా అనే ప్రధాన తెగలకు చెందిన నాయకులందరు ప్రత్యర్థుల రక్తాన్ని ఊచకోతల ద్వారా వరదనీరులా ప్రవహింపచేసిన వారే. అనేక అగ్రరాజ్యాలతో ఈ తెగల యుద్ధవీరులకు సత్సంబంధాలు ఉన్నాయి. పారిస్ నగరంలోని ఒక కూడలికి తజ్కీ తెగ గెరిల్లా యోధుడు అహ్మద్ మసూద్ పేరు ఉంది. అమెరికా నుంచి వచ్చిన విద్యావంతులు, మేధావులు హామిద్ కర్జాయి, అశ్రఫ్ ఘనీలను అఫ్ఘానీ సమాజం ఎప్పుడూ తమ నిజమైన ప్రతినిధులుగా గుర్తించలేదు. అంతర్జాతీయంగా మాత్రమే వారు అధికారిక నేతలుగా చలామణి అయ్యారు తప్ప స్థానికంగా వారెప్పుడూ తమ ఆధిపత్యం ప్రదర్శించడానికి ప్రయత్నించలేదు. కరుడుగట్టిన కక్షపూరిత విధానం, పష్తూన్ తెగ ఆధిపత్య అహంకారం, ఇస్లామిక్ ఛాందసవాదం, హింసాత్మక వైఖరి తాలిబన్ల స్వతస్సిద్ధ లక్షణాలు. ఉత్తర అఫ్ఘాన్ నుంచి మధ్య ఆసియాలోని మాజీ సోవియట్ దేశాలకు వెళ్ళే దారిలో ఇతర తెగల అధిపత్యం అధికంగా ఉంది. ప్రత్యర్థి తెగలు ఎంతకాలం సర్దుబాటు చేసుకుంటాయో కాలమే నిర్ణయిస్తుంది. ఇక స్వంత పష్తూన్లలో కూడ అనేక వర్గాలు, కీచులాటలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో తాలిబన్లు ఏర్పాటు చేసే ప్రభుత్వాన్ని గుర్తించడం ప్రపంచ దేశాలకు ఒక సవాల్‌గా మారింది. ఉగ్రవాదంపై రెండు దశాబ్దాల పోరాటంలో అమెరికా వైఫల్యంపై దిగ్భ్రాంతిలో ఉన్న అరబ్‌దేశాలు ఉగ్రవాద తాలిబన్ల ప్రభుత్వాన్ని గుర్తించడం అంత సునాయాసమేమీ కాదు. అటు చైనా ఇటు పాకిస్థాన్ అంశాల కారణంగా తాలిబన్ల విషయంలో భారత్ సంకట పరిస్థితిని ఎదుర్కొంటుంది.

## మత్తులో తూలుతున్న యువత

ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ





రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదు. ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని ప్రస్తావించాలి. 2019లో సంభవించిన సంఘటన ఇది. కొత్తగా పెళ్ళయిన ఒక జంటను, వధువు మేనత్త స్వయంగా తన ఖర్చుపై హానీమూన్ నిమిత్తం ఖతర్‌కు పంపింది. ఆ వధూవరుల బ్యాగులో వారికి తెలియకుండా మాదక ద్రవ్యాలను పంపించగా ఖతర్ విమానాశ్రయంలో బ్యాగేజి పరిశీలన అనంతరం ఆ జంటను అరెస్ట్ చేశారు. ఖతర్ న్యాయస్థానం ఆ అమాయక జంటకు సమారు కోటిన్నర రూపాయల జరిమానా, పది సంవత్సరాల జైలు శిక్ష విధించింది. హానీమూన్ నుంచి వారు ఎన్నాళ్ళకూ తిరిగిరాకపోవడంతో స్వదేశంలో తల్లిదండ్రులు, అత్తమామలు తీవ్రంగా కలవరపడసాగారు. ఒక రోజు ఖతర్ నుంచి ఒక మహిళ ముంబైలోని వధువు తండ్రికి ఫోన్ చేసి మీ కూతురు, అల్లుడు డ్రగ్స్ కేసులో పట్టుబడి జైళ్ళో ఉన్నారని చెప్పింది. హతాశుడైన ఆ తండ్రి ఖతర్‌కు వచ్చి ఏడాదిన్నర పాటు ఒక హొటల్‌లో బస చేసి జరిగిన ఘోరం వివరాలు తెలుసుకున్నాడు. ముంబైలో తన కుమార్తె, అల్లుడి చేతికి బ్యాగేజి ఇచ్చిన వ్యక్తులపై కేసు నమోదయి, సరైన దిశగా విచారణ జరిగినట్లుగా ఖతర్ న్యాయస్థానం భావిస్తే మాత్రమే జంట విడుదలకు ఆవకాశం ఉన్నట్లుగా ఆ దేశ అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఆ తండ్రి భారత్‌కు తిరిగి వచ్చి పోలీస్ స్టేషన్ మొదలు ప్రపధానమంత్రి కార్యాలయం దాకా 17 ప్రభుత్వ శాఖల చుట్టూ తిరిగాడు. మరాఠీ నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి అరబ్బీ భాషలోకి మహారాష్ట్ర పోలీసుల ఎఫ్.ఐ.ఆర్., పంచనామాలను అనువాదం చేయించేందుకు లక్షలాది రూపాయలను ఆ కుటుంబం ఖర్చు చేసింది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్.సి.బి. విచారణ చేసి బ్యాగేజి ఇచ్చిన మేనత్తతో సహా ఆరుగురిని సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసినట్లుగా ఇచ్చిన నివేదికను దౌత్యవర్గాల ద్వారా ఖతర్‌కు సమర్పించిన అనంతరం అతి అరుదైన కేసుగా ఖతర్ సుప్రీంకోర్టు కేసును పునఃసమీక్షించి జంటను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ రకమైన ప్రయత్నం అందరికి సాధ్యం కాదు కదా. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101